ప్రజాశక్తి

శుక్రవారం 7 నవంబర్ 2025 5

అనంతపురం

సిఐటియు నుంచి ఈఎస్ వెంకటేష్ బహిష్కరణ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

గతంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఈఎస్ వెంకటేష్‌ను సిఐటియు నుంచి బహిష్కరించినట్లు ఆసంఘం నాయకులు తెలిపారు. శ్రీ సత్య సాయి జిల్లా సిఐటియు కార్యాలయంలో గురువారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎల్ నరసింహులు, జిల్లా అధ్యక్షులు జడ్పీ శ్రీనివాసులు, కోశాధికారి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు పెడబల్లి బాబా, కార్యదర్శులు పైపల్లి గంగాధర్, రాము, బాబ్జాన్, ముత్యాలు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఐటియు పద్ధతులకు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఈఎస్ వెంకటేష్‌ను సిఐటియు నుంచి బహిష్కరించామన్నారు. భవిష్యత్తులో సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించే ఎలాంటి కార్యక్రమాలకు ఆయనకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. సిఐటియు పేరు చెప్పి ఎక్కడైనా కార్మికులకు సంబంధించి ఎలాంటి వ్యవహారాలు చేయరాదని అన్నారు. ఈ మేరకు గురువారం నిర్వహించిన ఆఫీస్ బేరర్ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు నాయకులు తెలిపారు.

నేటి నుంచి రెవెన్యూ ఉద్యోగుల ఆట.. పాట...

మూడు రోజుల పాటు రాష్ట్ర స్థాయి పోటీలు
ప్రారంభించనున్న ఎపి చీఫ్ సెక్రటరీ విజయానంద్
ప్రత్యేక ఆహ్వానితులుగా పివి.సింధు, జ్యోతి సురేష్, శ్రీకాంత్

పోటీల నిర్వహణ ఏర్పాట్లపై చర్చిస్తున్న రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు, అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలో మూడు రోజులపాటు ఆట,పాటల పోటీలు సాగనున్నాయి. నగరంలోని ఆర్డీటీ అనంత క్రీడా గ్రామంలో ఈనెల ఏడు నుంచి తొమ్మిదవ తేది వరకు జరుగుతున్న కార్యక్రమానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాలతోపాటు, రాష్ట్ర కేంద్రంలోని రెవెన్యూ ఉద్యోగులు పాల్గొంటున్నారు. మొట్టమొదటిసారి అనంతపురంలో జరుగుతన్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అవసరమైన ఏర్పాట్లను రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు చేస్తున్నారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొప్పిరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకట రాజేష్‌లతోపాటు అనంతపురం, సత్యసాయి జిల్లాల రెవెన్యూ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు గత కొన్ని రోజులుగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండే విధంగా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సుమారు 2500 మందికిపైగా పాల్గొనేందుకు ఉద్యోగులు అనంతపురం వచ్చారు. ఈపోటీల్లో ఇండోర్, అవుట్‌డోర్ పోటీలు నడుస్తున్నాయి. త్రోబాల్, వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్, కబడ్డి, క్యారమ్స్, చెస్‌లతోపాటు క్రికెట్, అథ్లటిక్స తదితర విభాగాల్లో పోటీలు జరుగనున్నాయి. వీటితోపాటు మ్యూజికల్ ఛైర్స్ ఉంటాయి. ప్రతి రోజూ సాయంత్రం ఆరు గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నడువనున్నాయి. అన్ని ఒకేసారి వేర్వేరు మైదానాల్లో జరిగే విధంగా ఏర్పాట్లు చేశారు.

ముఖ్య అతిథులుగా చీఫ్ సెక్రటరీ విజయానంద్

మూడు రోజులపాటు జరుగుతున్న రెవెన్యూ క్రీడల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ విజయానంద్ ప్రారంభించనున్నారు. సిసిఎల్ఎ స్పెషల్ సెక్రటరీ జయలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. అంతర్జాతీయ క్రీడాకారులు ఒలంపిక్ గోల్డ్ మెడలిస్టు పివి.సింధూ, ఆర్చరీ వరల్డ్ ఛాంపియన్ను మెడలిస్టు వన్నెం జ్యోతి సురేఖ, అంతర్జాతీయ బ్యాడిటన్ ప్లేయర్ కె.శ్రీకాంత్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరుకానున్నారు. గౌరవ అతిథులుగా ఐఎఎస్‌లు, పలువురు హాజరవు తున్నారు.

ప్రారంభ కార్యక్రమం ఇలా..

మొదటి రోజు ఏడవ తేదిన ప్రారంభోత్సవ కార్యక్రమం ఈ విధంగా ఉండనుంది

9.00 గంటలకు ముఖ్య అతిథితులు విచ్చేస్తారు

9.05 ముఖ్య అతిథులుగాను వేదిక మీదకు ఆహ్వానిస్తారు

9.15 స్పోర్ట్సు పతాకావిష్కరణ ఉంటుంది

9.25 ముఖ్య అతిథి చేత జ్యోతి ప్రజ్వలన ఉంటుంది

9.35 మార్చు ఫాస్టు

9.55 రెవెన్యూ ఉద్యోగుల సంఘంరాష్ట్ర అధ్యక్షుడి ప్రారంభోపన్యాసం ఉంటుంది

10.05 స్పోర్ట్సు మీట్ సందేశాన్ని ప్రధాన కార్యదర్శి ప్రవేశపెడతారు

10.15 జిల్లా అధ్యక్షుడి సందేశం

10.35 ముఖ్య అతిథి సందేశం

10.45ఆయా టీమ్‌ల క్యాప్టన్‌ల ప్రమాణం

10.55 ఆటలను సిసిఎల్ఎ స్పెషల్ సెక్రటరీ ప్రారంభిస్తారు.

పకడ్బందీ ఏర్పాట్లు : జేసీ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మార్చిఫాస్ట్ రిహార్సల్స్

అనంతపురం జిల్లాలో నవంబర్ 7, 8, 9 తేదీల్లో 7వ రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తున్నామని అందుకోసం అన్ని ఏర్పాట్లు చేపట్టామనిజాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ పేర్కొన్నారు. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలకు సంబంధించిన రిహార్సల్స్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 7, 8, 9 తేదీల్లో 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాల్లో రాష్ట్ర స్థాయి రెవెన్యూ ఉద్యోగులు పాల్గొంటున్నారన్నారు. ఇందులో రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, తదితరులు పాల్గొనడం జరుగుతుందన్నారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలను అనంతపురం జిల్లాలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. క్రీడా ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ ఏ.మలోల, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకట రాజేష్, ఆర్డీవోలు కేశవ నాయుడు, శ్రీనివాస్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, మల్లికార్జున రెడ్డి, రామ్మోహన్, మల్లికార్జున, రమేష్ రెడ్డి, తిప్పేనాయక్, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దివాకర్‌రావు, సెక్రటరీ సోమశేఖర్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోషియేషన్ ప్రెసిడెంట్, సెక్రటరీ సంజీవరెడ్డి, హరిప్రసాద్ రెడ్డి, సత్యసాయి ఏపీఆర్ఎస్ఎ ప్రెసిడెంట్ మధునాయక్, మీడియా ఇన్‌ఛార్జి మునివేలు, డీఎస్డీవో మంజుల తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో నవ శకానికి నాంది

సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

ప్రదర్శనలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అమెరికాలోని న్యూయార్క్ మేయర్‌గా డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి షోషలిస్టు భావాలు ఉన్న వ్యక్తి జోహ్రాన్ మమ్దానీ ఎన్నిక నూతన శకానికి నాంది అని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప అభివర్ణించారు. న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికైన జహ్రాన్ మమ్దానీకి జేజేలు తెలుపుతూ సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం టవర్‌క్లాక్ వద్ద ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.నాగేంద్ర కుమార్, ఆర్.చంద్రశేఖర్ శేఖర్ రెడ్డి, నగర నాయకులు వై.వెంకట నారాయణ, ప్రకాష్ రెడ్డి, వలి, మసూద్, ఇర్ఫాన్, ఎన్టీఆర్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓ. నల్లప్ప మాట్లాడుతూ అమెరికాకు కుంభస్థలం వంటి న్యూయార్క్ మహానగరంలో తనను తాను సోషలిస్టుగా ప్రకటించుకున్న డెమోక్రటిక్ అభ్యర్థి జోహ్రాన్ మమ్దానీ సాధించిన విజయం అపూర్వమన్నారు. పెట్టుబడిదారీ విధానం వికటాట్టహాసం చేసే చోట సామాన్యుడి ఆకాంక్షల స్వరాన్ని జోహ్రాన్ గట్టిగా వినిపించారని తెలిపారు. ప్రపంచ దేశాలపై పెత్తనానికి సామ్రాజ్యవాద వ్యూహాలు రూపొందించే చోట ప్రజల ఆరోగ్యం, పబ్లిక్ స్కూళ్ల బలోపేతం, ఇంటి అద్దెల నియంత్రణ వంటి అంశాలను ఆయన ఎజెండాగా చేశారని తెలిపారు. కార్పొరేట్ల లాభాలు మాత్రమే చర్చలుగా సాగే చోట కార్మికుల హక్కులను ఆయన ప్రస్తావించారన్నారు. మమ్దానీని ఎన్నుకుంటే న్యూయార్క్ నగరానికి నిధులు ఇవ్వబోమంటూ ట్రంప్ హెచ్చరించినా ప్రజలు ఏ మాత్రం ఖాతరు చేయలేదన్నారు. ట్రంప్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన నగర మాజీ మేయర్ ఆండ్రూ క్యూమోపై మమ్దానీ స్పష్టమైన ఆధిక్యత కనబరిచారని, తనను తాను డెమొక్రటిక్ సోషలిస్టుగా చెప్పుకునే మమ్దానీ న్యూయార్క్ నగరానికి తొలి ముస్లిం మేయర్ కాబోతున్నారని చెప్పారు. 1965 తర్వాత న్యూయార్క్ మేయర్ పదవికి పోటీ పడిన ఏ అభ్యర్థికీ మమ్దానీకి వచ్చినన్ని ఓట్లు రాకపోవడం విశేషమన్నారు. ఈ విజయాన్ని చూస్తుంటే ప్రజా సంక్షేమ విధానాలకే ప్రజలు మొగ్గు చూపారని స్పష్టమవుతోందన్నారు. ప్రజావాణిని అణచేసే శక్తులకు వ్యతిరేకంగా కలిసి నిలబడాలని ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు. సామాన్యులను పీడించి, వారి రక్తమాంసాలతో తెగబలిసిన సామ్రాజ్యవాదుల కబంధ హస్తాల నుండి బయటపడటానికి, ప్రత్యామ్నాయం వైపు అడుగులు వేయడానికి ప్రపంచం సిద్ధమౌతోందన్నారు. ఆ ప్రత్యామ్నాయం సోషలిజమే అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జీవ, వెంకట, ఇస్మాయిల్, శంకర్, శ్రీనివాసులు, రియాజ్, తిమ్మరాజు, ఇజ్రాయిల్, మనీ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా..? : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఆత్మకూరు

విద్యార్థుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యార్థుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా అని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తరిమెల గిరి, ఓతూరు పరమేష్ ప్రశ్నించారు. జిల్లాలోని విద్యారంగ సమస్యలను తెలుసుకోవటానికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన జీపు యాత్ర నాలుగవ రోజు ఆత్మకూరు పట్టణంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతుర్ పరమేష్, జిల్లా అధ్యక్షులు తరిమెలగిరి మాట్లాడుతూ జిల్లాలో నాలుగు రోజుల జీపుయాత్ర సందర్భంగా విద్యారంగ సమస్యలను విద్యార్థుల ఇబ్బందులను తెలుసుకున్నామన్నారు. ఈ విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో సంక్షేమ హాస్టళ్లు సంకట స్థితిలోకి చేరాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మకూరు మండలంలో విద్యారంగ సమస్యలు అనేకం ఉన్నాయని వాటిని పట్టించుకునే తీరిక పాలకులకు, అధికారులకు లేదని విమర్శించారు. కేజీబీవీకి ఆటస్థలం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారన్నారు. ఓవైపు రాష్ట్ర ప్రభుత్వం మహిళలు క్రీడల్లో రాణించాలని దేశానికి పేరు తేవాలని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారే తప్ప ఆట స్థలాలు, సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. ఆత్మకూరు మండలంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థునులు చదువుకోవడానికి ప్రభుత్వ పాఠశాల ఉన్నా అందుకు అనుబంధంగా గర్ల్స్ హాస్టల్ లేదని అన్నారు. అలాగే సంక్షేమ హాస్టల్లో తాగునీటి ఇబ్బందులున్నాయన్నారు. సంక్షేమ హాస్టళ్లలో ఇప్పటివరకు మెస్ ఛార్జీలు పెంచకుండా పెండింగ్లో ఉన్నటువంటి కాస్మోటిక్ చార్జీలు రిలీజ్ చేయకుండా ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోందని విమర్శించారు. ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల్లో ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యారంగ సమస్యలపై స్పందించకుంటే పెద్ద ఎత్తున ఎస్ఎఫ్ఐ ఉద్యమాలు నిర్వహిస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు భీమేష్ శివ, వంశీ, రషీద్, జిల్లా నాయకులు విజయ్, జయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

జిజిహెచ్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు నగర కార్యదర్శి ముత్తూజ
ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు, కార్మికులు

అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో 20 సంవత్సరాలుగా పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు, సూపర్‌వైజర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నగర కార్యదర్శి ముత్తుజా డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన కార్మికులతో కలసి గురువారం సిఐటియు ఆధ్వర్యంలో సర్వజనాసుపత్రి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్లను కలిశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 21 నుంచి సమ్మెలోకి వెళుతున్నామని సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం ముత్తూజ మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజనాసుపత్రి, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో పారిశుధ్య కార్మికులు, సూపర్‌వైజర్లు ఏళ్ల తరబడి పని చేస్తూ తమ కుటుంబాలని పోషించుకుంటున్నారని తెలిపారు. చాలా ఏజెన్సీలు నిర్వహణలో కూడా వారు పని చేశారని, నిత్యం హాస్పిటల్స్ క్లీనింగ్‌లో వారి పాత్ర చాలా కీలకమైందని అన్నారు. కరోనాలో కూడా, కుటుంబంలో పిల్లాపాపలను అందరిని వదిలేసి హాస్పిటల్స్‌లోనే నిద్రించి పని చేశారని తెలిపారు. ఈ మధ్యకాలంలో కొత్తగా పద్మావతి శానిటేషన్ వర్కర్స్ ఏజెన్సీ వారు టెండర్ పొందారన్నారు. టెండర్ నిబంధన ప్రకారం, ఇక్కడ పని చేస్తున్న వీరిలో 49 సంవత్సరాలు దాటిన వారు పనిలో ఉండరాదని తొలగిస్తామని, అదే రకంగా డిగ్రీ అర్హత లేని సూపర్వైజర్‌లందరినీ కూడా తొలగిస్తామని చెప్పడం అన్యాయంగా ఉందన్నారు. దీని వల్ల అనేక సంవత్సరాలుగా ఇదే పని నమ్ముకుని పని చేస్తున్న కార్మికుల్లో ఆందోళన నెలకొందన్నారు. పని చేస్తున్న వారిని కొనసాగించాలని, ఇప్పటి నుంచి కొత్తగా తీసుకుంటున్న వారికి కావాలంటే వారు చెబుతున్న నిబంధనలు వర్తింప చేయాలని విజ్ఞప్తి చేశారు. వీరందరినీ పనిలో కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు విధులు నిర్వహిస్తూనే నిరసనలు చేపడతామని, అప్పటికి స్పందించకపోతే ఈ నెల 21వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి కార్మికులు వెళతారని తెలిపారు.

తాగునీటి సరఫరా, ఆసుపత్రి కార్మికుల తొలగింపు అన్యాయం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్

విలేకరులతో మాట్లాడుతున్న నాగేంద్రకుమార్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

శ్రీరాంరెడ్డి తాగునీటి సరఫరాలో పని చేస్తున్న కార్మికులు, జిజిహెచ్, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు, సూపర్‌వైజర్ల అక్రమ తొలగింపులు, వేధింపులు ఆపాలని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్‌వి.నాయుడు, ఎస్.నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక గణేనాయక్ భవన్‌లోని సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అనంతపురం ఉమ్మడి జిల్లాలోని కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలో శ్రీరామ్ రెడ్డి తాగునీటి సరఫరా పథకంలో 17 సంవత్సరాలుగా 900 గ్రామాలకు త్రాగునీరు సరఫరా చేస్తూ 600 మంది కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. కొత్త కాంట్రాక్టర్ అడపాల వెంకటరావు దౌర్జన్య పూర్వకంగా వ్యవహరిస్తు తొలగింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. కార్మికులతో రూ. 100ల విలువైన ఖాళీ బాండ్లపై బలవంతంగా సంతకం చేయించడమే కాక, వేతనాలను రూ.17,300 నుంచి రూ.11వేలకు తగ్గించి, పిఎఫ్, ఈఎస్ఐ, బోనస్ వంటి హక్కులను నిరాకరించాడన్నారు. ఈ అన్యాయాలకు వ్యతిరేకంగా నిలిచిన 23 మంది కార్మికులను విధుల నుంచి అక్రమంగా తొలగించారని తెలిపారు.ఈ చర్యలు కార్మిక చట్టాలకు, మానవ హక్కులకు విరుద్ధంగా ఉన్నాయన్నారు. అశాస్త్రీయమైన 'లీటర్ బేస్' విధానం ప్రమాదకర పరిణామమని అన్నారు. "మోటర్లు చెడిపోవడం, కరెంటు లేకపోవడం, పైపుల లీకేజీలు వంటి సాంకేతిక సమస్యల వల్ల నీటి సరఫరా తగ్గుతుందన్నారు. అలాంటి పరిస్థితుల్లో లీటర్ బేస్ లెక్కల ప్రకారం కార్మికులపై అన్యాయంగా నష్టం మోపబడుతోందన్నారు. ఇది ప్రజలకు నీటి సరఫరా నిలిచిపోయే పరిస్థితిని కూడా తేవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమంగా తొలగించిన 23 మంది కార్మికులను వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఖాళీ బాండ్లపై బలవంతపు సంతకాలు చేయించిన కాంట్రాక్టర్ అడపాల వెంకటరావుపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 2025 నాటికి ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. 17 సంవత్సరాలుగా సేవ చేస్తున్న కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి పర్మనెంట్ నియామకాలు ఇవ్వాలన్నారు. అదే విధంగా ప్రభుత్వ సర్వజనాసుపత్రి, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు, సూపర్‌వైజర్‌లను తొలగింపు చర్యలకు ఏజెన్సీ నిర్వాహకులు పాల్పడటం అన్యాయంగా ఉందన్నారు. ఎంఓయు నిబంధనల పేరుతో ఏళ్ల తరబడి పని చేస్తున్న వారిని తొలగించడం సరికాదన్నారు. నూతన నియామకాలకు సబంధించి నూతన నిబంధనలు అమలు చేయాలి తప్పా ఇది వరకు పని చేస్తున్న వారిపై కాదని చెప్పారు. జిల్లాకు వస్తున్న రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ జిల్లాలోని తాగునీటి కార్మికులు, ఆసుపత్రి కార్మికులు, సూపర్‌వైజర్‌ల సమస్యల పరిష్కారానికి దృష్టి సారించాలన్నారు.కార్మికులకు అన్యాయం చేయాలని చూస్తే ఉధృత పోరాటాలు తప్పవని హెచ్చరించారు.

ఈ ఏడాదీ రైతన్నకు కన్నీరే..!

అతివృష్టితో కుదేలైన రైతులు - ఖరీఫ్‌తోపాటు చీనీకి దెబ్బ - ఆందోళనలో అన్నదాతలు

ప్రజాశక్తి-యల్లనూరు

ఈఏడూ రైతన్నకు కన్నీరు తప్పలేదు. ఓ సీజన్‌లో వర్షాలు రాక.. మరో సీజన్‌లో తుఫాన్‌తో పంటలు నాశనమయ్యాయి. దీంతో రైతన్నలు లబోదిబోమంటున్నారు. 'దేశానికి రైతే రాజు' అన్నది నానుడి మాత్రమే.. ఆచరణలో మాత్రం ఉండదు. ఎన్ని ప్రభుత్వాలు ఎన్ని మారినా.. రైతు కష్టాన్ని గుర్తించే వారే కరువయ్యారు. ఖరీఫ్ సీజన్ అయిన జూన్, జూలై మాసాల్లో మేఘాలు కమ్ముకున్న దాఖలలేవు. అలాంటిది సెప్టెంబర్ మాసం వచ్చే సరికి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మండల వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో 3733 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. మొక్కజొన్న 130 (ఎకరాల్లో), సోయాచిక్కుడు 305, కంది 561, మినుము 46, జొన్న 14, పత్తి 80, వేరుశనగ 11, వరి 1530 ఎకరాల్లో సాగు చేశారు. అయితే కోతదశలో వర్షాలు పడడంతో కొన్ని సోయా చిక్కుడు, వేరుశనగ, మినుము పంటలు తడిసి ముద్దయ్యాయి. నాలుగు మాసాలు కంటికి రెప్పలా కాపాడుకున్న పంట చేతికి రాకపోవడంతో రైతులు విలవిలలాడుతున్నాడు. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా పొందలేకపోయారు.

గిట్టుబాటు ధర లేని చీనీ

మండల వ్యాప్తంగా 12,318 ఎకరాల్లో చీనీ పంట సాగు చేశారు. అయితే ధర లేకపోవడంతో చీనీ కాయలను చెట్లపైనే వదిలేయాల్సి వస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటు ఖరీఫ్, ఇటు ఉద్యానవన పంటలు చేతికి వచ్చినట్టే వచ్చి చేజారిపోయయి. అలా అని రైతు వెన్నుచూపక తిరిగి రబీ సీజన్‌లో పప్పుశనగ సాగు చేశాడు. అది కాస్తా బూడిద పాలైందని రైతులు అవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలు

బాబ్బాబు.. బడికి రా..

గైర్హాజరవుతున్న విద్యార్థి ఇంటికి ఉపాధ్యాయులు-తల్లిదండ్రులకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి-నార్పల

'బాబ్బాబు బడికి రారా.. బడికి వచ్చి చదుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుంది.. ఉన్నత స్థానాలకు వెళ్తావు..' అంటూ పాఠశాలకు గైర్హాజరవుతున్న విద్యార్థి వద్దకు ఉపాధ్యాయులు వెళ్లి బతిమలాడారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న రఘువీర్ కొద్దికాలంగా పాఠశాలకు సక్రమంగా రాకుండా ఉన్నాడు. బాగా చదువుకునే విద్యార్థి ఎందుకు పాఠశాలకు సరిగా రావడం లేదని పాఠశాలలో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు నాగప్ప, మల్లికార్జున కలిసి విద్యార్థి రఘువీర్ ఇంటికి వెళ్లి తల్లితండ్రులతో మాట్లాడారు. 'మీ అబ్బాయి బాగా చదువుతాడు.. చదివిస్తే మంచి భవిషత్తు ఉంటుంది.. అంటూ హితబోధ చేశారు. తమ పని తాము చేసుకుని వెళ్లే ప్రస్తుత సమాజంలో బాగా చదువుకునే విద్యార్థి పాఠశాలకు రాకపోతే బాధ్యతాయుతంగా ఇంటి వద్దకు వెళ్లి విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థిని పాఠశాలకు పంపేవిధంగా చేసిన ఉపాధ్యాయులను పలువురు అభినందించారు.



విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు నాగప్ప, మల్లికార్జున

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

నగరంలోని ఎస్‌కెయు సమీపంలో ఉన్న రూడ్‌సెట్ సంస్థ నిరుద్యోగ యువతులు, మహిళలకు కల్పిస్తున్న ఉచిత శిక్షణ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళల స్వయం ఉపాధి కల్పన లక్ష్యంగా ఈనెలలో ఉచితంగా కారు డ్రైవింగ్, టైలరింగ్, బ్యుటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కోర్సుల్లో అర్హత కోసం 19ఏళ్ల నుంచి 45ఏళ్ల వరకూ తెల్లరేషన్ కార్డు కలిగిన వారందరూ అర్హులన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు తమ ప్రతినిధుల సెల్.. 94925 83484, 96188 76060 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

బీసీ బాలికల హాస్టల్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహాన్ని బుధవారం రాత్రి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గతనెల అక్టోబర్ 31వ తేదీన ప్రజాశక్తి దినపత్రికలో 'సంక్షేమ హాస్టల్లో సమస్యల కొలువు' అన్న శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే గత రాత్రి ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండా.. ఎవరికీ సమాచారం ఇవ్వకుండా నేరుగా హాస్టల్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఓ విద్యార్థిలా కలిసిపోయి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 'మీ సమస్యలు తెలుసుకునేందుకు వచ్చా.. ఏమైనా ఉంటే చెప్పండి..' అంటూ విద్యార్థులను అడిగారు. తర్వాత హాస్టల్లో విద్యార్థుల గదులు, మరుగుదొడ్లను స్వయంగా పరిశీలించారు. అనంతరం సిబ్బందితో ఎమ్మెల్యే మాట్లాడుతూ హాస్టల్లో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు.. వారికి మెనూప్రకారం అన్నీ అందిస్తున్నారా.. లేదా..అని అడిగి తెలుసుకున్నారు.

హాస్టల్ అధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణపై ఉద్యమిద్దాం

వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత, యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరించడాన్ని నిరసిస్తూ ఉద్యమిద్దామని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి పిలుపునిచ్చారు. మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు సాకే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక నగరపాలక సంస్థ ఎదుట 'కోటి సంతకాల సేకరణ' చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ జగన్ తన పాలనలో ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నా. వైద్య విద్యను, సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని ప్రజలకు చేరువ చేయడానికి రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక తన సొంత మనుషులు, వర్గానికి ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కట్టబెట్టడానికి ప్రయివేట్‌పరం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా మార్చారని విమర్శించారు. కూటమి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమం చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికైనా చంద్రబాబు మేల్కొని తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

స్థానిక ఎన్నికల్లో యాదవులకు ప్రాధాన్యత ఇవ్వాలి

యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు రామకృష్ణ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవులకు రాజకీయ ప్రాధాన్యత ఇచ్చి కార్పొరేటర్లుగా, మేయర్‌లుగా, సర్పంచ్‌లుగా రాజకీయ అవకాశం కల్పించాలని యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు రామకృష్ణ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్ యాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభాకర్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని యాదవ్ కళ్యాణ మండపంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 16 శాతం యాదవ సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నారని అయితే ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ అవకాశాలు కల్పించలేదన్నారు. ఏ పార్టీ అయితే యాదవులను గుర్తించి సముచిత స్థానం రాజకీయంగా కల్పిస్తుందో ఆ పార్టీలకు అండగా ఉంటామన్నారు. టిడిపి, జనసేన, బిజెపి, వైసిపిలు ఆ దిశగా యాదవ్‌లకు రాజకీయ అవకాశాలు కల్పించాలన్నారు. యాదవ సంఘం రాష్ట్ర నాయకులు నారాయణస్వామి యాదవ్ మాట్లాడుతూ యాదవ సంఘం నూతన కమిటిని ఎన్నుకున్నారని, జాతీ ప్రయోజనాల కాపాడుకుంటూనే సమాజానికి సంఘం సహాయ సహకారాలు అందిస్తుందన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న యాదవ సంఘం నాయకులు

మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీచైతన్య విద్యాసంస్థల ఛైర్‌పర్సన్ ఝాన్సీలక్ష్మీబాయి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం నగరంలోని కమ్మభవన్ సమీపంలో ఉన్న శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమాన్ని విద్యాసంస్థల అనంతపురం జోన్ ఎజిఎం సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎజిఎం మాట్లాడుతూ శ్రీచైతన్య విద్యాసంస్థల ఛైర్‌పర్సన్ ఝాన్సీ లక్ష్మీబాయి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం ఉచిత రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఇందులో భాగంగా 150 మంది రక్తదానం చేశారు. రక్తదాతలకు ఫ్రూట్ జ్యూస్, సర్టిఫికెట్, కీ ఛైన్, రూ.లక్ష బీమా పాలసీ అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీచైతన్య పాఠశాలల ప్రిన్సిపాళ్లు, డీన్‌లు, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

రక్తదాతకు జ్యూస్ అందజేస్తున్న ఎజిఎం సుబ్బారెడ్డి

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు 'దుర్గం' విద్యార్థులు

రాయదుర్గం : రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు రాయదుర్గం మండలం వడ్రవన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 4వతేదీన అనంతపురంలో నిర్వహించిన నెట్‌బాల్ పోటీ పరీక్షల్లో వడ్రవన్నూరు పాఠశాలకు చెందిన విద్యార్థులు కె.కార్తీక్, పి.సరిత, డి.మోక్షిత్, బి.వర్షిత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు ఈనెలలో విజయవాడ, ఏలూరులో జరగనున్న 69వ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు తమ విద్యార్థులు ఎంపిక కావడంపై ప్రధానోపాధ్యాయులు ఎం.జగన్నాథం, పీడీ పి.రామాంజనేయులు, పిఇటి రమేష్, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఆహార భద్రత మిషన్‌పై శిక్షణ

గుత్తి : మండలంలోని కొత్తపేట గ్రామంలో గురువారం జాతీయ ఆహార భద్రత మిషన్‌పై రైతులకు శిక్షణ ఇచ్చారు. ముందుగా పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ ఎం.వెంకటరాముడు, ఎఒ ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ రబీ సీజన్‌లో సాగు చేసే వేరుశనగ పంటకు విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాచురల్ ఫార్మింగ్ అధికారిణి వసుంధర, హెచ్ఒ మిత్రవింద మాధవి, ఎంపిఇఒ రాజ్యలక్ష్మి, అరుణ, పొలంబడి కోఆర్డినేటర్ నాగేష్, గౌతమపురి ఎఫ్‌పిసిఎల్ డైరెక్టర్లు సతీష్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ANANTAPURAMU MUNICIPAL CORPORATION
e-PROCUREMENT -Tender Notice

1	Tender Notice No.	266 to 274/General Funds/2025-26/TO
2	Scope of Work	Providing of CC Drain and CC Road and Providing Tractos with Trailer on hire basis in Anantapuramu Municipal Corporation
3	No. of works	9 Nos
4	Estimate Cost Ranging	Rs. 2.40 to 9.80 Lakhs

Note: . The details of tender may be seen on e-procurement market Place available @ https://tender.apeprocurement.gov.in

Sd/-Commissioner,
Municipal Corporation
Ananthapuramu

నాణ్యమైన విద్యాబోధనకు చర్యలు

ఎమ్మెల్యేలు అమిలినేని, దగ్గుపాటి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

రాష్ట్రంలో అన్నివర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనే లక్ష్యంగా రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి వెంకటప్రసాద్ అన్నారు. నారా లోకేష్ కళ్యాణదుర్గం పర్యటన నేపథ్యంలో గురువారం పట్టణంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఆర్డీఓ వసంతబాబు, డీఎస్పీ రవిబాబుతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఇందులో భాగంగా కనకదాస సర్కిల్‌లో అభివృద్ధి పనులతో పాటు వివిధ ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం 7వ తేదీ రాత్రి మంత్రి లోకేష్ బస చేయడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక విశ్రాంతి భవనాన్ని పరిశీలించారు. కాగా పంచాయతీరాజ్ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయడమే కాకుండా ఉద్యోగులకు ఎన్నో మేలు చేకూరే విధానాలు తీసుకొచ్చిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణకు పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్ లక్ష్మీదేవి, వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వైపీ.రమేష్, యార్డు వైస్ ఛైర్మన్ కోనంకి రాజశేఖర్, సీనియర్ నాయకులు చౌళం మల్లికార్జున, డిఎల్‌డిఒ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు

నైపుణ్యంతోనే మెరుగైన ఉపాధి

అంతర్జాతీయ సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం

నేటి ఆధునిక శాస్త్ర సాంకేతిక యుగంలో నైపుణ్యాలను మెరుగు పరచుకుంటేనే ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని ఆంధ్రప్రదేశ్ ఔషధ మొక్కలు, సుగంధ ద్రవ్యాల బోర్డు ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆవుల చంద్రశేఖర్ సూచించారు. ఎస్‌ఆర్ఎం యూనివర్సిటీలోని డాక్టర్ ఎపిజె అబ్దుల్‌కలాం ఆడిటోరియంలో గురువారం ఉదయం ప్రతిష్టాత్మకమైన 'రెండో అంతర్జాతీయ సదస్సు ఎపిక్ -2025' ప్రారంభమైంది. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగే సదస్సులో యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ సిహెచ్ సతీష్‌కుమార్ తొలిరోజు ప్రారంభోపన్యాసం చేశారు. ప్రపంచవ్యాప్తంగా వెలువడుతున్న తాజా పరిశోధనా ఫలితాలను అధ్యాపకులు, విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. సాంకేతిక విప్లవంతో 5జి, 6జి, కృత్రిమ మేధ, డేటా కేంద్రాలు, అటానమస్ వెహికల్స్, క్వాంటం కంప్యూటింగ్, మెడికల్ ఇమేజింగ్, బయో సెన్సర్స్ వంటివి అందుబాటులోకి వచ్చాయన్నారు. వర్తమానంలో ఎలక్ట్రానిక్స్ ప్రభావం ఉందని, భవిష్యత్తును పోటానిక్ లే శాసిస్తాయని అభిప్రాయపడ్డారు. అనంతరం అబ్ స్ట్రాక్ట్ బుక్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉపకులపతి ప్రొఫెసర్ సిహెచ్ సతీష్‌కుమార్, డీన్ ప్రొఫెసర్ సివి టోనీ, కన్వీనర్ డాక్టర్ గౌతమ్‌కుమార్ రానా, ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ కెవి సునీత, తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో పాల్గొన్న వక్తలు

పంచాయతీల్లో మౌలిక వసతులు కల్పించాలి : డిఎల్‌డిఒ

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని పంచాయతీల్లో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని డిఎల్‌డిఒ శివలీలా సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు పన్నుల వసూళ్లు, పంచాయతీల అభివృద్ధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఎల్‌డిఒ మాట్లాడుతూ పంచాయతీల్లో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు కార్యాలయానికి చేరుకుని మండలంలోని పంచాయతీల్లో లైట్లు వెలగడం లేదని, తాగునీరు సక్రమంగా రావడం లేదని ఫిర్యాదు చేశారు. ఇందుకు డిఎల్‌డిఒ స్పందిస్తూ సంబంధిత కార్యదర్శులు, సర్పంచులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మమతాదేవి, డిప్యూటీ ఎంపిడిఒ శైలజారాణి, వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బండ్లపల్లి కుళ్లాయప్ప, సింగిల్‌విండో అధ్యక్షులు మహేష్‌నాయుడు, పిఎల్ లక్ష్మీనారాయణ, శివనాయుడు, ప్రసాద్‌నాయుడు, ప్రకాష్‌నాయుడు, పంచాయతీ కార్యదర్శులు శ్యామల, శ్రీనివాసులు, వెంకటరమణ, పరుశురాం, గోపాల్‌రెడ్డి, సాయినాథ్‌రెడ్డి, లక్ష్మీదేవి, రాజేశ్వరి, కీర్తన, సింధుజా, గౌతమి, కుళ్లాయప్ప, చంద్రమాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డిఎల్‌డిఒ శివలీలతో మాట్లాడుతున్న రాష్ట్ర వాల్మీకి డైరెక్టర్ కుళ్లాయప్ప

మాట్లాడుతున్న టిసి వరుణ్

రెవెన్యూ సమస్యలు అహుడా గ్రీవెన్స్‌లో ఇవ్వొద్దు

అనంతపురం కార్పొరేషన్ : రెవెన్యూ అంశాలకు సంబంధించిన అర్జీలను ఇవ్వొద్దని అహుడా నిర్వహించే గ్రీవెన్స్‌లో ఇవ్వొద్దని అహుడా ఛైర్మన్ టీసీ వరుణ్ సూచించారు. గురువారం స్థానిక గ్రీవెన్స్ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్, జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అహుడా పరిధిలోని సమస్యలను పరిష్కరించడానికే గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం అహుడ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎంఐజి లేఅవుట్లు, పింక్ టాయిలెట్ల నిర్మాణం, పెనుగొండ సెంట్రల్ లైటింగ్, అనంతపురం లో స్విమ్మింగ్ పూల్, వివిధ అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ప్లానింగ్ ఆఫీసర్ కెఎండి ఇషాక్, జెపిఒ హరీష్, సెక్రటరీ రామకృష్ణారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దుష్యంత్, డిఇ రేవంత్ జ్యోతి పాల్గొన్నారు.

'అనంత'పై తెలుగు మహిళల వ్యాఖ్యలు హాస్యాస్పదం

అనంతపురం : వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డిపై తెలుగుదేశం పార్టీ మహిళలు చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని వైసిపి మహిళా విభాగం నగర అధ్యక్షురాలు సాకే చంద్రలేఖ అన్నారు. గురువారం అనంతపురంలోని వైసిపి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవంలో ఎలాంటి అవినీతి మరకలు లేని అనంత వెంకట్రామిరెడ్డిపై టిడిపి మహిళా విభాగం నాయకురాళ్లు చేసిన అవినీతి ఆరోపణలపై తాము బహిరంగ సవాల్‌కు సిద్ధమన్నారు. ఏడాదిన్నర పాలనలో ఒక్క హామీ సక్రమంగా అమలు చేయలేని కూటమి నాయకులు అనంత వెంకటరామిరెడ్డిపై ఆరోపణలు చేయడం బాధాకమరన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణవేణి, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు రాధాయాదవ్, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కామర్‌తాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి అంజలి, నగర ప్రధాన కార్యదర్శి మహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పరిశీలన

ఆత్మకూరు : మండలంలోని పి.కొత్తపల్లి గ్రామానికి వేస్తున్న తారు రోడ్డు పనులను టిడిపి నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే పరిటాల సునీత ఎన్నికల ముందు కొత్తపల్లి గ్రామస్తులకు ఇచ్చిన హామీ మేరకు తారు రోడ్డు వేయిస్తున్నట్లు టిడిపి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు, హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి శశాంక్‌చౌదరి, మాజీ కన్వీనర్ చౌదరి, బూత్ కన్వీనర్ ఉమాపతి దాము, వార్డు మెంబర్ సీతయ్య, వాల్మీకి సాధికార నాయకులు కందుల ఓబుళపతి, ఆనంద్, తెలుగు అధ్యక్షుడు అంకే ఆనంద్, కురుబ ఆదెప్ప, అక్కులన్న, సుధాకర్, ఆంజనేయులు, కిష్టప్పచౌదరి, యూనిట్ ఇన్‌ఛార్జి క్రరీ ఆవుల పెద్దన్న, గ్రామ కమిటీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పుట్లూరు విద్యార్థి

పుట్లూరు : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఆర్.భరత్‌కుమార్ కబడ్డీ క్రీడలో అండర్-17 బాలుర విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్‌ను వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు, మండల విద్యాధికారులు శ్రీదేవి, ప్రేమ్‌కుమార్ పాఠశాల సిబ్బంది, బిసిహెచ్‌డబ్ల్యు శివారెడ్డి, పూర్వ విద్యార్థులు అభినందించారు.

ప్రజా సౌకర్యమే ధ్యేయం

శింగనమల : ప్రజల సౌకర్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ గురువారం ఒక ప్రకటనలో అన్నారు. మండల కేంద్రం సమీపంలోని శింగనమల క్రాస్ వద్ద లైట్లు లేకపోవడంతో మహిళలు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఎపి ట్రాన్స్‌కో సిబ్బంది, చక్రాయపేట సర్పంచు పంచాయతీ కార్యదర్శి సహకారంతో బస్టాప్ వద్ద విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించి వీధిలైట్లు వేయించారు. దీంతో ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీ కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి

నార్పల : పంచాయతీల్లో పని కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని కార్మికులు కోరారు. ఈమేరకు పంచాయతీ కార్మికులకు స్థలాలు, ఇల్లు మంజూరు చేయాలని, వారంతపు సెలవు శుక్రవారం ఇవ్వాలని, సీనియార్టీ బట్టి ప్రమోషన్లు ఇవ్వాలని త్వరలో చేపట్టనున్న సమ్మెకు సంబంధించిన నోటీసును పంచాయతీ కార్యదర్శి శ్యామలకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నార్పల గ్రామ పంచాయతీలో గత 30ఏళ్లుగా ఎలక్ట్రీషియన్, వాటర్‌మెన్, స్వీపర్లుగా, కంప్యూటర్ ఆపరేటర్‌గా, అటెండర్‌గా విధులు నిర్వహిస్తూ చాలీచాలని జీతాలతో వెట్టి చాకిరీ చేస్తున్నామన్నారు. కావున తమకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. లేనిపక్షంలో సమ్మెలోకి వెళ్తామని తెలిపారు.

ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని జక్కలచెరువు గ్రామ శివారు సర్వే నంబర్ 644-బీలో క్వార్జ్ మైన్ ఏర్పాటుపై అధికారులు గురువారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన గుంతకల్లు ఆర్‌డిఒ శ్రీనివాస్, తహశీల్దార్ పుణ్యవతి కలిసి ప్రజలు, ఎన్జీఓలతో అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మైన్‌లో స్థానికులనే పనిలో పెట్టుకోవాలన్నారు. పంట పొలాలకు నష్టం వాటిల్లికుండా నిర్వహించుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. అనంతరం మైన్ కోసం దరఖాస్తు చేసిన పిరిడిసాయి మినరల్స్ యజమాని నారాయణస్వామి మాట్లాడుతూ గ్రామంలో ఎంతమంది స్కిల్ లేబర్ ఉన్నా పని కల్పిస్తామన్నారు. పంటలకు ఎలాంటి నష్టం వాటిల్లినా పరిహారం అందిస్తామన్నారు. అలాగే గ్రామాభివద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ జి.సూర్యప్రతాప్, ఆర్ఐ హనుమాన్ ప్రసాద్, కార్యదర్శి వెంకటేష్, కాలుష్య నివారణ కంట్రోల్ బోర్డు ఇఇ కిషోర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అధికారులు

తైక్వాండో విజేతలకు ఎంపీ అభినందన

అనంతపురం సిటీ : ఇటీవల రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన రాష్ట్ర తైక్వాండో పోటీల్లో అండర్-14, 17, 19 ఏజ్ క్యాటగిరిల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు పలు పతకాలు సాధించారు. దీంతో వీరందరినీ గురువారం తన ఛాంబర్‌లో ఎంపి అంబికా లక్ష్మీనారాయణ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు, శిక్షకులు, కె.శాంతరాజ్, రామాంజి, తులసి, రాజేష్, శ్రీకాంత్, యోగానంద, అంజుమ్, తడితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులను అభినందిస్తున్న ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

కరువు మండలాలను ప్రకటించాలి

గుత్తి : జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని వైసిపి ఐటీ విభాగం జిల్లా అధ్యక్షులు వై.రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వైసిపి ఆధ్వర్యంలో ఎడిఎ ఎం.వెంకటరాముడుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలు నష్టపోయిన రైతుకు ఎకరాకు రూ.25వేలు నష్టపరిహారం చెల్లించి, క్రాప్ ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పండ్ల, కాయగూరల పంటకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దేవేంద్ర, గాదిలింగ, కోనా అనుష్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, ఖాజా, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

యల్లనూరు : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 33 కెవి విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎఇ పద్మనాభరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు, ప్రజలు, అధికారులు సహకరించాలని కోరారు.

వాహనాల తనిఖీ

యల్లనూరు : మండల పరిధిలోని బుక్కాపురం మలుపు వద్ద ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా అధిక లోడుతో ప్రయాణిస్తున్న బొలేరో, ఐచర్లకు అపరాధ రుసుం విధించారు. అలాగే ద్విచక్ర వాహనాల ఆర్‌సి, బీమా, హెల్మెట్ లేని వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

'అక్షరాంధ్ర'పై శిక్షణ

యాడికి : మండల కేంద్రములోని శ్రీ వెంకటేశ్వర మండల సమైక్య ఆధ్వర్యంలో ఉల్లాస్-అక్షరాంధ్ర కార్యక్రమంపై గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రతిగ్రామంలో నిరక్షరాశ్యులను అక్షరాస్యులను చేయడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ధనలక్ష్మి, ఎపిఎం చంద్రశేఖర్, ఎపిఒ మద్దిలేటి, సీసీలు, ఎంఎస్‌ఎ, విఒఎలు, వాలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ప్రజాదర్బార్

రాయదుర్గం : పట్టణంలోని కణేకల్లు రోడ్డు వద్ద ఉన్న టిడిపి కార్యాలయంలో విప్ కాలవ శ్రీనివాసులు ప్రజా సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి గురువారం ఒక ప్రకటన వెలువడింది. శుక్రవారం ఉదయం 11:30 గంటల నుండి మధ్యాహ్నం ఒకటిన్నర గంట వరకు ఎమ్మెల్యే ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరిస్తారని కార్యాలయం తెలిపింది.

9న ఉచిత కంటి వైద్యశిబిరం

పామిడి : శ్రీ భావసార క్షత్రియ కళ్యాణ మండపంలో ఈనెల 9వతేదీన ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రభుత్వ ఆయూష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రఘువీర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈక్రాప్‌పై అవగాహన

గుంతకల్లు రూరల్ : స్థానిక కార్యాలయంలో ఈక్రాప్ బుకింగ్‌పై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారిణి లీనా వసుంధర మాట్లాడుతూ ఈక్రాప్ నమోదులో భాగంగా ఆయా పంటలు, దిగుబడిని పరిశీలించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మొక్కజొన్న, వేరుశెనగ, కంది, పత్తి తదితర పంటలను రైతులు సాగు చేసిన విధానాన్ని అనుగుణంగా అంచనా వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిఇఒలు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎఒ లీనావసుంధర

ఖోఖో టోర్నమెంట్ జట్టు ఎంపిక పోటీలు

అనంతపురం : ఎస్‌జిఎఫ్ అండర్-14 ఖోఖో జిల్లాస్థాయి టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ పోటీలను గురువారం నగరంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు శ్రీనివాసులు, శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీధర్, రమేష్, ప్రభాకర్, సురేష్, శాంతలింగం, నిర్మల, మల్లికార్జున, లోకేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

పోటీలకు హాజరైన క్రీడాకారులు

రాష్ట్రస్థాయి పోటీలకు 'మాంటిస్సోరీ' విద్యార్థి

రాప్తాడు : మండలంలోని గొల్లపల్లి సమీపంలో ఉన్న మాంటిస్సోరి ఎలైట్ ఇంగ్లీష్ మీడియం కళాశాల విద్యార్థి ఎ.హర్ష జిల్లాస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యాడు. ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న హర్ష అండర్- 19 కేటగిరి జిల్లాస్థాయిలో ఖోఖో పోటీలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. దీంతో హర్షతోపాటు కోచ్ వీరన్నను కళాశాల ఎండి కృష్ణభరత్, కరస్పాండెంట్ కృష్ణ సమీర, ప్రిన్సిపాల్ ప్రతాప్‌రెడ్డి, కళాశాల ఇన్‌ఛార్జి మధు, తదితరులు అభినందించారు.

రాష్ట్ర పోటీలకు ఎంపికైన ఎ.హర్ష

రాష్ట్రస్థాయి రైఫిల్ పోటీలకు విద్యార్థులు

అనంతపురం సిటీ : ఇటీవల ఎస్‌జిఎఫ్ పాఠశాల జిల్లాస్థాయి రైఫిల్ షూటింగ్‌లో సత్తాచాటిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఒంగోలుకు బయలుదేరారు. ఈ మేరకు ఎస్‌జిఎఫ్ సెక్రటరీ శకుంతలమ్మ విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పిఇటిలు, రైఫిల్ షూటింగ్ కోచ్‌లు శ్రీకాంత్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

గట్టు రామాంజిపై రౌడీషీట్ ఎత్తివేయాలి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పేదల పక్షాన పని చేసినందుకు గట్టు రామాంజిపై రౌడీషీట్ వేయడం సరికాదని, తక్షణమే తొలగించాలని జైభీమ్‌రావు పార్టీ, ఇతర ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. గురువారం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పొరంపోగు భూమి తెలిసి పేద ప్రజలు గుడిసెలు వేసుకున్నారని తెలిపారు. అయితే ఆ స్థలాలు మావంటూ ప్రహరిగోడ పడగొట్టారని గట్టు రామాంజిపై త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సిఐ రౌడీషీట్ తెరవడం అన్యాయంగా ఉందన్నారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలన్నారు. గట్టు రామాంజిపై విధించిన రౌడీషీట్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జైభీమ్‌రావు పార్టీ రాష్ట్ర కార్యదర్శి గట్టు రామాంజి, ప్రజా సంఘాల నాయకులు బికెఎస్.ఆనంద్, చలపతి, ఏసుపాదం, రామప్ప నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

రాయదుర్గం : పట్టణంలోని కణేకల్ రోడ్డు వద్ద ఓ యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. గుమ్మఘట్ట మండలం సిరిగేదొడ్డి గ్రామానికి చెందిన కౌలురైతు ప్రహ్లాద (32) వ్యవసాయం చేసుకుంటూ జీవించేవాడు. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం మేకలకు మేత కోసం ఆకులు తీసుకునేందుకు చెట్టు ఎక్కి కొమ్మలు విరుస్తుండగా పైన ఉన్న విద్యుత్ తీగలు తగిలి విద్యుత్ షాక్‌కు గురై కింద పడ్డాడు. వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.


మృతిచెందిన ప్రహ్లాద